క్లుప్తంగా

పీహెచ్‌సీకి కుర్చీల అందజేత



కుర్చీలు అందజేస్తున్న దాత

పాలకొల్లు అర్బన్: యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని వీవర్స్‌కాలనీలో గల ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌కు రూ.8 వేల విలువైన కుర్చీలు, బెడ్‌షీట్లు అందజేశారు. దాత కొండ్రెడ్డి సూరిబాబు విరాళంగా అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు జక్కంపూడి మదన్, జక్కంపూడి రాంప్రసాద్, గుండుమోగుల వీరాస్వామి, మంగిన సాయి, డాక్టర్ హేన, అన్నామణి, రాజామణి, బాబి తదితరులు పాల్గొన్నారు.

138 మందికి వైద్య పరీక్షలు



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

యలమంచిలి: మండలంలోని ఏనుగువానిలంక గ్రామంలో సోమవారం విజయవాడకు చెందిన పీవీఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు గుండె, సాధారణ రోగులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని స్థానిక ఎంపీటీసీ వినుకొండ ధనలక్ష్మీ రవికుమార్ ప్రారంభించారు. శిబిరంలో 138 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 72 మందికి గుండెకు సంబంధించిన ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు ఉచితంగా చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో డాక్టర్ పి.వెంకటరామ్ (ఆర్థోపెడిక్), డాక్టర్ సందీప్ (కార్డియాలజీ), డాక్టర్ మాధురి (గైనకాలజీ), డాక్టర్ హర్షిత (ఎండీ) డాక్టర్ మహిమ (జనరల్ మెడిసిన్) రోగులకు వైద్య పరీక్షలు చేశారు. శిబిర నిర్వహణకు పవన్‌కుమార్, సుభద్ర సహకారం అందించారు.

17 మంది విద్యార్థినుల పరీక్ష ఫీజు చెల్లింపు



విద్యార్థినులకు పరీక్ష ఫీజుల సొమ్మును అందజేసిన దాత

పాలకొల్లు అర్బన్: కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సంస్థ తరఫున దాసరి నారాయణరావు మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న 17 మంది పేద విద్యార్థినులకు పరీక్ష ఫీజు చెల్లించారు. సోమవారం క్లబ్ తరఫున పెన్మెత్స బుద్ధరాజు విద్యార్థినులకు రూ.17 వేలు అందజేశారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి తెలిపారు. విద్యార్థులకు పరీక్ష ఫీజులు చెల్లించడానికి ముందుకొచ్చిన క్లబ్ అధ్యక్షుడు గాంధీ భగవాన్‌రాజు, కార్యదర్శి వీవీ సోమరాజు, కోశాధికారి ఆర్.రమేష్‌బాబులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ స్వరూప్‌సింగ్, డాక్టర్ రమణ, డాక్టర్ సత్యనారాయణ, రమేష్, మహాలక్ష్మి, భాగ్యలక్ష్మి, రేవతి, ప్రసన్న, జ్యోత్స్న, జూలియా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి



మంత్రి నిమ్మల రామానాయుడికి వినతి పత్రం అందిస్తున్న జిన్నూరు గ్రామస్తులు

పోడూరు: మండలంలోని జిన్నూరు గ్రామంలో ప్రధాన కాలువపై నూతన వంతెన నిర్మించి 12 ఏళ్లయినా అప్రోచ్ రోడ్డు లేక నిరుపయోగంగా ఉందని, అప్రోచ్ నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్తులు సోమవారం మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడికి వినతి పత్రం అందజేశారు. అలాగే గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, మంచినీటి పైపులైన్ శిథిలమై తాగునీరు కలుషితమవుతుందని, మంచినీటి చెరువు చుట్టూ రివిట్‌మెంట్ నిర్మించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి రామానాయుడు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. దండు గోపాలకృష్ణంరాజు, దేవళ్ల ప్రసాద్, భూపతిరాజు సత్యనారాయణరాజు, విటాకుల రమణారావు, పెన్మెత్స పెదబాబు, కోసూరి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

దత్త ధ్యాన మందిర నిర్మాణానికి శంకుస్థాపన

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని కంచర్ల వీధిలో దత్త జ్ఞాన బోధ సమితి ఆధ్వర్యంలో దత్త ధ్యాన మందిర నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన నిర్వహించారు. మందిర నిర్మాణానికి స్థల దాత వెలువెలి వెంకట రమణశర్మ దంపతులచే బ్రహ్మశ్రీ సన్నిధిరాజు శివదుర్గశర్మ బ్రహ్మత్వంలో ఆగమశాస్త్ర విధానంలో శంకుస్థాపన చేశారు. కమిటీ సభ్యులు ఎ.కృష్ణాజీ, సాయిరాం, సీహెచ్ రామలింగేశ్వర శాస్త్రి, గోపరాజు గణపతిరావు పాల్గొన్నారు.

పరాయి పంచన అంగన్‌వాడీలు

- సగానికి పైగా కేంద్రాలకు సొంతగూడు కరువు
- అద్దె భవనాల్లో వసతులు లేక చిన్నారుల ఇక్కట్లు



నాగరాజు పేటలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

పాలకొల్లు అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత గూడు కరువైంది. సమగ్ర శిశు అభివృద్ధి సంస్థ, పాలకొల్లు ప్రాజెక్టులో గల యలమంచిలి, పోడూరు, పాలకొల్లు పట్టణం, పాలకొల్లు మండలాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాలు సగానికి పైగా అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. మరికొన్ని కేంద్రాలను మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన భవనాల్లో నిర్వహిస్తున్నారు. దీంతో అంగన్‌వాడీ చిన్నారులకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే అద్దె భవనాల్లో వసతుల లేమితో అంగన్‌వాడీ సరుకులు, రికార్డులు భద్రపరచుకోవడానికి అంగన్‌వాడీ వర్కర్లు ఇబ్బందులు పడుతున్నారు. పాలకొల్లు సెక్టారు పరిధిలో లయన్స్ నగర్ అంగన్‌వాడీ కేంద్రం, వరిధనం అంగన్‌వాడీ కేంద్రాలు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. అలాగే కొత్తపేట పంచాయతీ పరిధిలోని గుబాలగుంట, పెంకుళ్లపాడు, నాగరాజుపేట లో గల అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. అద్దె భవనాలకు రూ.1500 నుంచి రూ.2 వేలు చెల్లిస్తున్నారు. అయినా చాలీచాలని ఇరుకు గదుల్లో విద్యార్థులు సేదతీరుతున్నారు. కొత్తపేట పంచాయతీ పరిధిలోని గుబాలగుంట అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలం సుమారు రెండు సెంట్లు సేకరణ చేశారు. అయితే భవన నిర్మాణానికి తీసుకోవలసిన చర్యలు ముందుకు సాగడం లేదు. పెంకుళ్లపాడులో అంగన్‌వాడీ కేంద్ర భవనంలో ఫ్లోరింగ్ పాడైంది. నాగరాజుపేటలో గల అంగన్‌వాడీ కేంద్ర భవనం ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారు.

పాలకొల్లు నియోజకవర్గంలో అంగన్‌వాడీల వివరాలు

మండలం	సొంత భవనాలు	అద్దె భవనాలు	మొత్తం
పోడూరు	33	37	70
యలమంచిలి	34	51	85
పాలకొల్లు	41	37	78
పాలకొల్లు పట్టణం	0	25	25

20 ఏళ్ల నుంచి అద్దె భవనంలోనే



కొత్తపేట పంచాయతీ పరిధిలో గుబాలగుంటలో అంగన్‌వాడీ కేంద్రం గత 20 ఏళ్ల నుంచి అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నాం. గ్రామంలోని ఐదారు భవనాలు మారాం. ఇటీవల వారం రోజుల క్రితమే అద్దె భవనాలోకి కేంద్రాన్ని మార్చాం. స్థల సేకరణ నిర్వహించారు. గ్రామ పెద్దల దృష్టికి తీసుకు వెళ్లాం.

–లక్కవరపు దానమ్మ, అంగన్‌వాడీ టీచర్, గుబాలగుంట

అంగన్‌వాడీ భవనాలు నిర్మాణంలో ఉన్నాయి



నియోజకవర్గంలో చాలా గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. 2014 నుంచి 2019, అలాగే 2019 నుంచి 2024 మధ్య కాలంలో కొన్నిచోట్ల భవన నిర్మాణాలు ప్రారంభించాం. పురోగతిలో ఉన్నాయి. అన్ని కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించడానికి చర్యలు తీసుకుంటాం.

–సీహెచ్ ఇందిర, సీడీపీవో, పాలకొల్లు ప్రాజెక్టు



కొత్తపేట గుబాలగుంటలో అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రం



వరిధనంలో ఎంపీ పాఠశాల భవనంలో అంగన్‌వాడీ కేంద్రం



పెంకుళ్లపాడులో అద్దె భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి

జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు



ముదునూరి ప్రసాదరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బండి రమేష్

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు కోరారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన పాలకొల్లు పట్టణంలోని ఆరో వార్డు ఇన్‌చార్జి బండి రమేష్‌ను వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమించిన సందర్భంగా సోమవారం ప్రసాదరాజును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నేతలను, కార్యకర్తలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. అయితే కార్యకర్తలు బెదిరిపోకుండా ధైర్యంతో నిలబడాలన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. ప్రసాదరాజును కలిసిన వారిలో బండి రమేష్‌తోపాటు పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, నాయకులు కెల్లా పెద్దిరాజు, కెల్లా దుర్గారావు, గేదెల నరసింహారావు, ఉండ్రాజవరపు రవికుమార్, పడవల రాజా తదితరులు ఉన్నారు.

సోలార్ రూఫ్‌తో మెండుగా విద్యుత్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో దాసి రాజు

పాలకొల్లు అర్బన్: ప్రతి లబ్ధిదారుడు తమ ఇంటి డాబా మీద సోలార్ రూఫ్ ఏర్పాటు చేసుకోవడం వలన కొన్ని వేల మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినవారవుతారని ఆర్డీవో దాసి రాజు అన్నారు. పాలకొల్లు రూరల్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆర్డీవో దాసి రాజు పాల్గొని మాట్లాడారు. మూడు కిలో వాట్ల సోలార్ రూఫ్ ఏర్పాటు చేసుకున్నట్లయితే రూ.78వేలు ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. అలాగే బ్యాంక్ కూడా రుణం అందిస్తుందన్నారు. ఈ రుణాన్ని ప్రతి నెలా వాయిదా పద్ధతిలో చెల్లించొచ్చన్నారు. సోలార్ రూఫ్‌లో మిగిలిన విద్యుత్‌ను విద్యుత్ సంస్థ కొనుగోలు చేస్తుందన్నారు. అవగాహన సదస్సులో లబ్ధిదారుల అనుమానాలను నివృత్తి చేశారు. తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్, ఎంపీడీవో ఎస్ఎస్ ఉమామహేశ్వరరావు, ఎలక్ట్రికల్ ఎస్ఈ ఎ.రఘునాథబాబు, ఎలక్ట్రికల్ ఈఈ కొల్లాబత్తుల మధుకుమార్, ఏడీఈ సీహెచ్ రామకృష్ణ, ఈవోపీఆర్డీ తాళ్ల మూర్తిబాబు, పంచాయతీ కార్యదర్శి సీహెచ్ సత్తిబాబు, సోలార్ రూఫ్ కాంట్రాక్టర్లు దొడ్డా కిషోర్, జె.వేణుగోపాలకృష్ణ, టి.జయంత్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి పడమర గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సోమవారం సీతారామాంజనేయల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు మూడు రోజులుగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లయాన్ని సందర్శించిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలన్నారు. ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు ఆలయాలు దోహద పడతాయన్నారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఆధ్యాత్మిక విద్యకు స్ఫూర్తి భగవద్గీత



చిట్టవరంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: ఆధ్యాత్మిక విద్యలో విప్లవాత్మక మలుపు తిప్పిన భవద్గీతలో మూడు ఆత్మల గురించి శాస్త్రీయంగా వివరించి బోధించిన మొట్టమొదటి త్రైత సిద్ధాంత భగవద్గీత అని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి మామిడి కుదురు కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చిట్టవరం గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. త్రిమత ఏకైక గురువు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారి త్రైత సిద్ధాంత గ్రంథాలను దైవ జ్ఞాన ప్రచారంలో భాగంగా గీతా జయంతి మాసాన్ని పురస్కరించుకుని గ్రామస్తులకు అందించారు. ఆది భారతదేశంలో ఆత్మ జ్ఞానులు సంపూర్ణంగా ఉండేవారని ఆత్మజ్ఞానం కలిగిన వారిని హిందూ జ్ఞానం కలవారు అని, హిందువులని, ప్రపంచ జ్ఞానం కలవారని ఇంగిత జ్ఞానం కలవారని చెప్పేవారన్నారు. అందుకే ఇతర దేశాలు మన దేశాన్ని హిందుత్వాన్ని బోధించే దేశంగా హిందూ దేశమని పిలిచే వారని ఆయన వివరించారు. ఈ వాస్తవమైన జ్ఞానాన్ని తెలియజేయాలన్నదే ఈ ప్రచారం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. దీనిలో భాగంగా త్రైత సిద్ధాంతం వాస్తవమైన జ్ఞానం అని తెలియజేస్తూ గ్రామాల్లో ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు హనుమంతరావు, బ్రహ్మాజీ, సత్యవతి, సుబ్బారావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులతో పోషకాల లోపం



పాలకొల్లు అర్బన్: లంకలకోడేరులో విద్యార్థులకు మాత్రలు మింగిస్తున్న వైద్య సిబ్బంది



పోడూరు: జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుప్రజ

పోడూరు: నులిపురుగుల కారణంగా చిన్నపిల్లల్లో పోషకాల లోపం ఏర్పడుతుందని పోడూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుప్రజ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం విద్యార్థులకు ఆరోగ్యసిబ్బంది నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. స్థానిక కల్నల్ డీఎస్‌రాజు జెడ్పీ హైస్కూల్‌లో మెడికల్ ఆఫీసర్ సుప్రజ పాల్గొని విద్యార్థులకు మాత్రలు వేశారు. కార్యక్రమంలో ఎంఈఓ జి.సూర్యనారాయణ, ఏఎన్ఎం వి.విమల, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీ

పాలకొల్లు అర్బన్: ప్రతి విద్యార్థితో నులిపురుగుల నివారణకు ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ అన్నారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించారు. పాఠశాలకు రాని విద్యార్థులకు ఈ నెల 17వ తేదీన మాత్రలు మింగించే ఏర్పాటు చేస్తామన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి.ఎలిజబెత్, సూపర్‌వైజర్లు ఎస్‌కే అమశేశ్వరరావు, డి కమల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూనిక్ ఐడీ తప్పనిసరి



యలమంచిలి: ఫార్మర్ రిజిస్ట్రీని పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు

యలమంచిలి: సొంత భూమి ఉన్న రైతులు యూనిక్ ఐడీ (ఫార్మర్ రిజిస్ట్రీ) నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని నరసాపురం ప్రాంతీయ సహాయ వ్యవసాయ సంచాలకురాలు ఈద అనిలకుమారి కోరారు. చించినాడ సచివాలయం వద్ద సోమవారం ఆమె ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకీకరణ (డిజిటలైజేషన్) చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు తెచ్చిన సంఖ్య (యూనిక్ ఐడీ) ఆధార్ కార్డు తరహాలో రైతులకు అందించనుందని ఆమె వివరించారు. కనుక సొంత భూమి గల రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు పథకాల రాయితీలు పొందాలంటే ప్రతి రైతూ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. రైతులు తమ పరిధిలోని రైతుసేవా కేంద్ర సిబ్బంది సంప్రదించి తమ పాసుబుక్ జిరాక్స్ లేదా 1బి జిరాక్స్, ఆధార్ జిరాక్స్, ఆధార్ నంబరుకు లింక్ అయినా ఫోన్ నెంబర్ తీసుకొని వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆమె కోరారు.

రైతుల నమోదు పర్యవేక్షణ



పెనుగొండ: రైతు నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి స్పందన

పెనుగొండ: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రైతు సంక్షేమ పథకాలు లబ్ధి పొందడానికి రైతులు తప్పని సరిగా రిజిస్ట్రీ చేయించుకోవాలని పెనుగొండ మండల వ్యవసాయాధికారి పి.స్పందన తెలిపారు. సోమవారం చెరుకువాడ సచివాలయంలో రైతుల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. రైతులకు యూనిక్ ఐడీ నంబరు ఇవ్వడం జరుగుతుందన్నారు. యూనిక్ ఐడీ ఉన్న వారికి మాత్రమే పీఎం కిసాన్, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, రాయితీలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్ట పరిహారం అందుతుందని వివరించారు. సొంత పొలం ఉన్న రైతులు రైతు సేవా కేంద్రాలకు వచ్చి రిజిస్ట్రీ చేయించుకోవాలని సూచించారు.

మత్స్యకారులకు అవగాహన సదస్సు



మత్స్యకారులకు అవగాహనను కల్పిస్తున్న సహాయ సంచాలకుడు ఎల్ఎల్ఎన్ రాజు

నరసాపురం రూరల్: సముద్ర తాబేళ్లను సంరక్షించుకోవడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చని మత్స్యశాఖ సహాయ సంచాలకుడు ఎల్ఎల్ఎస్ రాజు అన్నారు. సోమవారం నరసాపురం మండలం చినమైనవానిలంకలో సముద్రపు ఒడ్డున మత్స్యకారులతో నిర్వహించిన అవగాహన సదస్సు లో ఆయన మాట్లాడారు. సముద్రపు ఒడ్డుకు తాబేళ్ల మృత కళేబరాలు కొట్టుకొస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సముద్రపు వేటకు వెళ్లే మత్స్యకారులు ఎవరైనా తాబేళ్లను పట్టుకోవడం లేదా చంపడం వంటి పనులకు పూనుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు మైల వసంతరావు, ఎఫ్‌డీవో కె.భారతి, అటవీ, మత్స్యశాఖ, మెరైన్ పోలీస్‌శాఖల సిబ్బంది, మత్స్య సహకార సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు ఆర్థిక సాయం చేస్తున్న జైమ్ యువసేన ఫౌండేషన్ సభ్యులు

యలమంచిలి: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే నిజమైన దైవసేవని జైభీమ్ యువసేన ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గెడ్డం సునీల్ గవాస్కర్ అన్నారు. వడ్డిలంక గ్రామంలో గత నెలలో జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పోర్షన్ల తాటాకిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో కామన మారియ్య, నాగమణి, కామన నాగేశ్వరరావు, దుర్గాభవాని కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. ప్రమాదంలో గృహోపకరణాలు దగ్ధం కావడంతో ఆ రెండు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ప్రమాద విషయం ఆలస్యంగా తెలుసుకున్న జైభీమ్ యువసేన ఫౌండేషన్ సభ్యులు సోమవారం వడ్డిలంక వెళ్లి అగ్ని ప్రమాద బాధితులకు రూ.18 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గెడ్డం సునీల్ గవాస్కర్ మాట్లాడుతూ ప్రతి నెలా క్రమం తప్పకుండా ఆపదలో ఉన్న వారికి ఈ విధమైన సహకారం అందిస్తున్నట్లు వివరించారు. ఫౌండేషన్ సభ్యులకు ప్రమాద బాధితులతోపాటు గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శ్రీను, ప్రసాద్, సురేష్, రాజు, విజయ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల పంపిణీ

పాలకొల్లు అర్బన్: సేవాతత్వానికి నిలువెత్తు నిదర్శనం తులసీ సీడ్స్ అధినేత తులసీరామచంద్రప్రభు అని పలువురు వక్తలు ప్రశంసించారు. పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాలులో సోమవారం రాత్రి నియోజకవర్గ కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు చెందిన 329 మంది విద్యార్థులకు రూ.12.90 లక్షల ఉపకార వేతనాలను రామచంద్రప్రభు ప్రోత్సాహంతో అందజేశారు. డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి (బాబ్జి), చవ్వాకుల ట్రస్ట్ అధినేత చవ్వాకుల సూర్య నరేష్‌బాబు, యర్రంశెట్టి వెంకటరత్నం, డా.ముచ్చర్ల సంజయ్, డా.వంగా శేషు, కొమ్ముల మురళీకృష్ణ, మండెల రజనీ, గంటా శ్రీనివాస్, దాసరి లక్ష్మీనారాయణ, పెనుమాక రామమోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ మాజీ అధ్యక్షుడు కాండ్రేగుల మృతి



కాండ్రేగుల సత్యనారాయణ (ఫైల్)

పెనుగొండ: కొడమంచిలి సొసైటీ మాజీ అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ(63) సోమవారం మృతి చెందారు. కొడమంచిలి సొసైటీ అధ్యక్షుడుగానూ, పంచాయతీ ఉప సర్పంచ్‌గానూ విధులు నిర్వహించారు. కాండ్రేగులకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు మంగళగిరి సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. కొడమంచిలి వైఎస్సార్‌సీపీలో కీలకంగా వ్యవహరించారు. కాండేగుల మృతి మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, ఎంపీటీసీలు చిలుకూరి నాగ దుర్గభవానీ, ఎల్లమెల్లి బేబీ రాజేష్, ఉప సర్పంచ్ ములగాడ వరప్రసాద్, పార్టీ నాయకులు జక్కంశెట్టి వెంకటేశ్వరరావు, బొక్కా రామకృష్ణ, పుచ్చకాయల నాగార్జున, బొరుసు రాంబాబు, మన్నే సుబ్బారావు, కోట వెంకటేశ్వరరావు, పోలిశెట్టి వనమరాజు, కుసుమ నారాయణమూర్తి పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి



సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్

నరసాపురం: మున్సిపాలిటీలో ఆస్తి, కుళాయి, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ తన చాంబర్‌లో పన్నుల వసూళ్లపై మున్సిపల్ రెవెన్యూ అధికారులు, వార్డు సచివాలయాల కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మార్చి ఆఖరుకు నూరుశాతం పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. పన్నుల వసూళ్లకు కార్యాలయంలో స్పెషల్ కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.